## మూడవ ప్రకరణం

# బిద్అతీల విషయంలో ఇస్లామీయ సమాజం వైఖరి, వారి పోకడలను ఖండించటంలో 'అహ్లెసున్నత్ వల్ జమాఅత్' విధానం

## (1) బిద్అతీల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి :

'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వారు నిత్యం బిద్అతీల పనులను ఖండిస్తూ వచ్చారు. దీనివల్ల పట్టబోయే దుర్గతి గురించి హెచ్చరించారు. తత్సంబంధితమయిన కొన్ని మచ్చుతునకలు ఇవి :

**(అ) ఉమ్మె దర్దా (رضي الله عنها) కథనం :** "ఒకసారి అబూదర్దా (رضي الله عنه) ఆగ్రహంతో ఊగిపోతూ నా వద్దకు వచ్చారు. 'ఇంతకీ ఏం జరిగింది?' అని నేనడిగాను. దానికి ఆయన ఇలా అన్నారు : 'దైవసాక్షి! వారిలో ముహమ్మద్ (صلى الله عليه وسلم) అందజేసిన ధర్మంలోని ఏ వస్తువూ నాకు కనిపించటం లేదు. చూడబోతే వారంతా నమాజు చేసేవారే." (బుఖారీ)

**(ఆ) ఉమర్ బిన్ యహ్యా కథనం :** ఆయన ఇలా తెలిపారు – నేను నా తండ్రి చెప్పగా విన్నాను. ఆయన గారు తన తండ్రి ఆధారంగా ఈ విషయాన్ని వివరించారు : "మేము ఫజ్ర్ నమాజ్‌కు ముందు అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) గుమ్మం వద్ద కూర్చునేవారం. ఆయన బయటకు రాగానే మేమందరం ఆయన గారితో కలిసి మస్జిద్‌కు వెళ్ళేవారం. ఒకనాటి మాట! మా వద్దకు అబూ మూసా అష్అరీ (رضي الله عنه) ఏతెంచారు. 'ఏమిటీ, అబూ అబ్దుర్రహ్మాన్ ఇంకా బయలుదేరలేదా?' అని ఆయన అడిగారు. 'లేద'ని మేమన్నాము. ఆయనగారు కూడా ఆయన (అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్) కోసం మాతోపాటే నిరీక్షించారు. ఆయన బయటికి రాగానే, మేమంతా లేచి నిలబడ్డాము. ఆయన (అబూ మూసా) ఇలా అన్నారు : 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్! నేను ఇప్పుడిప్పుడే మస్జిద్‌లో ఒక దృశ్యం చూశాను. అది నాకు నచ్చలేదు. అల్ హమ్దులిల్లాహ్ నేను చూసిన వస్తువు మంచిదే.' 'ఇంతకీ ఏమిటదీ?' అని ఆయన ప్రశ్నించగా, ఆయన ఇలా సమాధానమిచ్చారు: 'తమరు గనక బ్రతికి ఉంటే, తమరే తమ కళ్లతో దానిని చూసుకుంటారు' అని చెప్పి ఇలా వివరించారు : 'నేను మస్జిద్‌లో కొంతమందిని నమాజు నిరీక్షణలో వలయాకారంలో కూర్చోవటం చూశాను. ప్రతి వలయం మధ్యలో ఒక వ్యక్తి ఉన్నాడు. అతని చేతిలో కంకరరాళ్ళు ఉన్నాయి. అతను జనులను ఉద్దేశ్యించి, వందసార్లు **"అల్లాహు అక్బర్"** అనండి అంటున్నాడు. వారంతా వందసార్లు **"అల్లాహు అక్బర్"** అంటున్నారు. తరువాత అతను వందసార్లు **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అనండి అని పురమాయిస్తున్నాడు. వారంతా వందసార్లు **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అంటున్నారు. తరువాత అతను వందసార్లు **"సుబ్‌హానల్లాహ్"** అనండి అని చెబుతున్నాడు. వారంతా వందసార్లు **"సుబ్‌హానల్లాహ్"**

https://teluguislam.net

అంటున్నారు.’ ‘మరయితే మీరు వారితో ఏమన్నారు?’ అని ఆయన అడిగారు. ‘నేను దీని గురించి మీ అభిప్రాయం, ఆజ్ఞ ఏమిటో తెలుసుకునేందుకు వేచి ఉన్నాను. వారిని ఏమీ అనలేదు’ అని సమాధానమిచ్చారు. ‘మీరు మీ పాపాలను లెక్కపెట్టుకోండి అని వారిని ఎందుకు ఆజ్ఞాపించలేదు? వారి పుణ్యకార్యమేదీ వృథా అవదని కూడా మీరు వారికి భరోసా ఇవ్వాల్సింది కదా!’ అని అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (رضي الله عنه) అన్నారు.

తరువాత ఆయన బయలుదేరారు. మేము కూడా ఆయన వెనకే నడిచాము. చివరకు అక్కడ వృత్తాకారంలో కూర్చుని ఉన్నవారిలో ఒక బృందం వద్దకు వెళ్ళారు. అక్కడ వారినుద్దేశించి, “ఇంతకీ మీరిక్కడ ఏం చేస్తున్నారు?” అని ప్రశ్నించారు. దానికి వారు, “ఓ అబూ అబ్దుర్రహ్మాన్! ఇవి కంకర రాళ్లు. వీటి సహాయంతో మేము తక్బీర్, తహ్లీల్, తస్బీహ్, తహ్మీద్‌లను లెక్కించుకుంటున్నాము” అని బదులిచ్చారు.

అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (رضي الله عنه) వారందరినీ ఉద్దేశించి ఇలా ఉపదేశించారు : “(లెక్కించుకోవాలనే ఉంటే) మీరు మీ పాపాలను లెక్కపెట్టుకోండి. మీ పుణ్యకార్యమేదీ వృథా గావించబడదని నేను మీకు హామీ ఇస్తున్నాను. ఓ ముహమ్మద్ సమాజ సభ్యులారా! మీ పాడుగాను! మీరెంత తొందరగా వినాశకర మార్గాన పడిపోయారు కదా! ఆయన(صلى الله عليه وسلم) సహచరులు ఇంకా బ్రతికే ఉన్నారు. ఆయన (صلى الله عليه وسلم) దుస్తులు ఇంకా శిథిలమవనే లేదు. ఆయన (صلى الله عليه وسلم) పాత్రలు ఇంకా పగిలిపోలేదు. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నా! మీరు ఉంటే ముహమ్మద్ (صلى الله عليه وسلم) పద్ధతికన్నా మంచి పద్ధతి మీద ఉన్నారు లేదా మీరు మార్గభ్రష్టత యొక్క ద్వారాన్నయినా తెరువబోతున్నారు!”

అలా చెప్పి ఆయన (رضي الله عنه) అక్కడి నుండి వెళ్ళిపోయారు. అమ్ర్ బిన్ సలమా ఇలా అంటున్నారు : మేము వారిలో అనేకులను చూశాము – వారు నహర్వాన్ యుద్ధం జరిగిన నాడు ఖవారిజ్ వర్గీయులతో చేరి మాపై కత్తులు దూయసాగారు. (సుననె దారిమీ పీఠిక : 210)

(ఇ) హజ్రత్ ఇమామ్ మాలిక్ బిన్ అనస్ (رحمه الله) వద్దకు ఒక వ్యక్తి వచ్చి, ‘నేను ఎక్కడి నుండి ఇహ్రామ్ దీక్షబూనాలి?’ అని అడిగాడు. “దైవప్రవక్త (صلى الله عليه وسلم) ఎక్కడి నుండి ‘మీఖాత్’ ను నిర్ధారించారో అక్కడి నుండి! ఆయన (صلى الله عليه وسلم) స్వయంగా ఎక్కడి నుండి ఇహ్రామ్ కట్టుకున్నారో అక్కడి నుండి!” అని ఆయన చెప్పారు. ‘నేను మీఖాత్ రాకముందే ఇహ్రామ్ కట్టుకుంటే పోయిందేముందీ?’ అని ఆ వ్యక్తి ప్రశ్నించాడు. “నా దృష్టిలో అది సరైంది కాద”ని మాలిక్ బిన్ అనస్ (رحمه الله) బదులిచ్చారు. ‘ఎందుకు సరైంది కాదు?’ అని ఆ వ్యక్తి మళ్లీ అడగటంతో ఆయన (رحمه الله), “నీవు ఉపద్రవానికి గురవుతావేమోనని నాకు భయంగా ఉంది” అన్నారు. ‘ఎక్కువ మేలును కాంక్షించటంలో ఉపద్రవం ఏముంది?’ అని ఆ వ్యక్తి మళ్లీ రెట్టించి అడిగాడు. ఇమామ్ మాలిక్ (رحمه الله) ఇలా అన్నారు : ఎందుకంటే అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿فَلْيَحْذَرِ الَّذِينَ يُخَالِفُونَ عَنْ أَمْرِهِ أَن تُصِيبَهُمْ فِتْنَةٌ أَوْ يُصِيبَهُمْ عَذَابٌ أَلِيمٌ﴾ (النور: ٦٣)

https://teluguislam.net

**వినండి! ప్రవక్త ఆజ్ఞను ఎదిరించేవారు తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చిపడుతుందేమోనని లేదా తమను ఏదయినా బాధాకర మయిన శిక్ష చుట్టుకుంటుందేమోనని భయపడాలి. (అన్ నూర్ : 63)**

ఇంతకన్నా పెద్ద ఉపద్రవం ఏముంటుంది చెప్పు? నీవు నీ కొత్త ఆచరణ ద్వారా దైవప్రవక్త (ﷺ)నే మించిపోవాలనుకుంటున్నావు. అవునా!?"

(ఈ సంఘటనను అబూ షమామా గారు తన పుస్తకం – "అల్ బాయిస్ అలా ఇన్కార్ అల్ బిద్అ వల్ హవాదిస్" (పేజీ : 14)లో అబూబకర్ ఖిలాల్ నుండి నకలు చేశారు).

ఇవి మచ్చుకు కొన్ని సంఘటనలు మాత్రమే. ఇస్లామీయ విద్వాంసులైతే సర్వకాల సర్వావస్థల్లో అల్ హమ్దులిల్లాహ్ కొత్త పోకడలు పోయే వారిని ఎండగడుతూనే వచ్చారు.

**(2) బిద్అతీల చర్యలను ఖండించటంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వారి పద్ధతి :**

ఖుర్ఆన్ హదీసుల ఆధారంగా ఎదుటి వ్యక్తిని సమాధానపర్చాలన్నదే వారి విధానం. వారు బిద్అతీల సందేహాలను కూలంకషంగా వివరించి, వాటికి విరుగుడును ప్రతిపాదిస్తారు. సున్నతులను ఖచ్చితంగా పాటించవలసిందిగా సూచిస్తారు. ధర్మంలో కొత్తగా కల్పించబడిన విషయాలకు దూరంగా ఉండవలసిన ఆవశ్యకతను ఖుర్ఆన్ హదీసుల ఆధారాలతో నొక్కి వక్కాణిస్తారు. ఈ నేపథ్యంలో వారు అనేక రచనలు చేశారు. ఉదాహరణకు వాటిలో కొన్ని పుస్తకాలివి :

1. ఇమామ్ షాతిబీచే విరచితమైన "అల్ ఏతెసామ్".
2. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియచే విరచితమైన పుస్తకం, "ఇఖ్తెజా అస్సిరాతిల్ ముస్తఖీమ్" – ఈ పుస్తకంలోని ఓ పెద్ద భాగం బిద్అతీల చర్యలను ఖండిస్తోంది.
3. ఇబ్నె వజాహ్ చే విరచితమైన "ఇన్కారుల్ హవాదిస్ వల్ బిద్అ."
4. తిర్తోషీచే విరచితమైన "అల్ హవాదిస్ వల్ బిద్అ."
5. అబూ షామాగారి పుస్తకం–"అల్ బాయిస్ అలా ఇన్కారుల్ బిద్అ వల్ హవాదిస్."

**మరికొన్ని కొత్త పుస్తకాలు**

1. షేఖ్ అలీ మహ్ఫూజ్ గారి పుస్తకం "అల్ అబ్దాఅ ఫీ మజాద్దుల్ ఇబ్తెదా."

2. షేఖ్ ముహమ్మద్ బిన్ అహ్మద్ అల్ షఖీరీ అల్ హవామిదీ గారి పుస్తకం – "అల్ సునన్ వల్ ముబ్తదిఆత్ అల్ ముత్తాల్లుఖతు బిల్ అజ్కార్ వస్సలవాత్."

దైవకృపవల్ల ఇస్లామీయ విద్వాంసులు పత్రికలు, మ్యాగజైన్లు, రేడియోలు, టెలివిజన్, జుమా ప్రసంగాలు, సెమినార్లు, ప్రసంగాల ద్వారా బిద్అతీల పోకడలను నిరంతరం ఖండిస్తూ వచ్చారు. బిద్అతీలు ఏ విధంగా ముస్లిం సమాజంలో జొరబడి విశ్వాసాన్ని బలహీనపరుస్తున్నారో వివరించి, ప్రజలలో ధార్మిక చైతన్యాన్ని తీసుకువచ్చారు. ఈ విధంగా వారు ధర్మంలోని కొత్త పుంతలను నిర్మూలించటంలో, బిద్అతీల బండారాన్ని బయటపెట్టడంలో కీలకపాత్ర పోషించారు.

https://teluguislam.net